క్లుప్తంగా

24న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి మూల విరాట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు గ్రామంలో ఈనెల 24న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గోసుల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఉదయం ఆలయంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, శివునికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటలకు కళ్యాణం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీప సేవ

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని కాల భైరవాపురంలో బుధవారం శ్రీ ఇష్టకామ్యార్థ కాల భైరవస్వామి ఆలయంలో కూష్మాండ దీప సేవ నిర్వహించారు. నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న ఈ గ్రామంలో అమావాస్యను పురస్కరించుకుని ఉదయం స్వామి మూల విరాట్‌కు అభిషేకం, అలంకారం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు కుష్మాండ దీప సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ పూజా విధానాన్ని తెలుపుతూ పూజలు నిర్వహించారు. దాన్ని స్వామికి సమర్పించిన అనంతరం వాటిపై దీపాలు వెలిగించి ఆరాధన నిర్వహించి పూజలు చేశారు.

క్రీడాకారులకు అభినందన



ఎంపికైన విద్యార్థులతో డీఈఓ రాఘవరెడ్డి, హెచ్ఎం తదితరులు

కడప ఎడ్యుకేషన్ : అనంతపురంలో ఈ నెల 21 నుంచి జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో భువనశ్రీ, శ్రీవల్లి, శ్రీయ, నందిని, యాస్మిన్, లహారి, ఇందు, ప్రసన్న, మేరీ, రేష్మ ఉన్నారు. వీరిని బుధవారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో డీఈఓ రాఘవరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి అభినందించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దుర్గాప్రసాద్

కడప కల్చరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని గురువారం కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదరణ స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీ విజయదుర్గాదేవి ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నిరాశ్రయుల వసతి గృహంలోని వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం ప్రతినిధులు సాయి తదితరులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని పలు కూడళ్లతోపాటు రిమ్స్ ఆవరణం, ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ బాయ్స్ హాస్టల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాసట సంస్థ సభ్యులు చంద్రమౌళిరెడ్డి, ఈశ్వరయ్య, విష్ణువర్ధన్, విజయ్, నరసింహారెడ్డి, హరిబాబు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని రిమ్స్ ఆవరణలోని డెంటల్ ఆసుపత్రిలో దంత వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని ఆర్‌సీపీ నాయకులు రమేష్‌బాబు కోరారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంటల్ ఆసుపత్రి పేరుకే ఉందని పేదలకు ఉపయోగపడే వైద్యం అందడం లేదని ఆరోపించారు. దంత రోగులు రూట్ కెనాల్ చేయమంటే ఆ వైద్యం ఇక్కడ లేదని వైద్యులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి డెంటల్ ఆసుపత్రిలో రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌ను అమలు చేయాలని కోరారు.

రైతు బజారు.. సమస్యల షికారు!

కడప అగ్రికల్చర్ : నగరంలోని రైతు బజార్‌లో సౌకర్యాలు కరువయ్యాయి. పర్యవేక్షణ కొరవడడంతో సమస్యలు ఎక్కిరిస్తున్నాయి. రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను స్వయంగా అమ్ముకునే వెసులుబాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రైతు బజార్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో సమస్యలు తిష్టవేశాయి.

అన్నీ సమస్యలే..

కడప రైతు బజార్‌లో కనీస మంచినీటి సౌకర్యం కూడా లేదు. వ్యాపారులతోపాటు, వినియోగదారులకు గుక్కెడు నీరు అందక అవస్థలు పడుతున్నారు. అసలే ఎండాకాలం.. ఇలా మంచి నీటి సౌకర్యం కూడా లేకపోవడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. దెబ్బతిన్న చప్పట.. పగిలిన టైల్స్.. పలు చోట్ల గుంతలు.. ఎటుచూసినా బజారు నిండా సమస్యలే కానొస్తున్నాయి. వీటితోపాటు రైతు బజార్ నిర్వహణ కూడా సరిగా ఉండటం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, దెబ్బతిన్న కూరగాయలను పడేయటం సర్వసాధారణంగా మారింది. దీంతో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఇక ప్రధాన రహదారిలో పలు షాపుల నిర్వాహకులు రోడ్డుకు అడ్డంగా కూరగాయల బుట్టలను పెట్టారు. దీంతోపాటు పలు తోపుడు బండ్ల నిర్వాహకులు కూడా రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో రైతు బజారుకు వచ్చే జనాలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

రైతు బజార్‌లోని సమస్యలపై ఎస్టేట్ ఆఫీసర్ బుక్కే సోమ్లానాయక్‌తో మాట్లాడగా కొద్ది రోజుల నుంచి మంచినీటి సమస్య ఉందని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ప్రస్తుతం రైతు బజార్‌లో మంచినీటి దాహార్తికి చలివేంద్రను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. మిగతా సమస్యలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.



కడపలోని రైతు బజారు



రైతు బజార్‌లో పనిచేయని వాటర్ ప్లాంట్



పడేసిన కూరగాయలు, చెత్తాచెదారం

దేశాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నగరంలోని ఎన్జీఓ నగర్, అంబేడ్కర్ నగర్, చంద్రమౌళి నగర్, ఆర్ట్స్ కళాశాల మైదానాల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార భేరిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను తీసేస్తూ నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారన్నారు. బడ్జెట్‌లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. వామపక్ష నాయకులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, చంద్రారెడ్డి, భాగ్యలక్ష్మీ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



వాకర్లకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల గురించి తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

ఆర్ట్స్ కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు కరుణాకర్ కళాశాలకు విచ్చేసి ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజానికి విలువలు కలిగిన ఉత్తమ పౌరులను అందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర ఎంతో కీలకమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ నీలయ్య, దయానందం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై తల పెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఇందిరాభవన్‌లో జై సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చార్లెస్, కోటపాటి లక్ష్మయ్య, కుళ్లాయప్ప, చెప్పలి పుల్లయ్య పాలగిరి శివ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైవీయూ ఎన్ఎస్ఎస్ సేవలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో కొప్పర్తిలో ఎన్ఎస్ఎస్ సేవలు కొనసాగుతున్నాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సరిత పర్యవేక్షణలో గురువారం సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రత్యేక శిబిరంలో భాగంగా కొప్పర్తిలోని స్థానిక అంగన్వాడీ కేంద్రం, ఉన్నత పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు బిస్కట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి నిరుద్యోగుల వివరాలు సేకరించారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరంలోని ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన అమీన్‌పీర్ దర్గాలో గురువారం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా మాలిక్ మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ ఉరుసు ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలలో భాగంగా గంధం సమర్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చి గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కడపకు వచ్చిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు, ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. 2014 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం, రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. మళ్లీ తనకు అధికారమిస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీనే ఎన్నిసార్లు ఇస్తారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు లాంటి మోసకారిని మళ్లీ నమ్మి ఓట్లు వేయడానికి ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కిరణ్ పాల్గొన్నారు.

స్టేడియంను పరిశీలించిన కమిషనర్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంను గురువారం కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయిప్రవీణ్‌చంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని, ప్రతి ఒక్కటి కూడా వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిమ్ సెంటర్‌ను పరిశీలించిన ఆయన ఫ్లోరింగ్ మరమ్మతులు వెంటనే చేయించి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం క్రీడాభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలపై డీఎస్ఏ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియం సిబ్బంది, కోచ్‌లకు సూచనలు చేస్తున్న కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్

22న 'మిత్ర సమూహ' ఆవిర్భావ దినోత్సవం

కడప కల్చరల్ : ధరిత్రీ దినోత్సవ సందర్భంగా ఈనెల 22న కడప నగరంలోని మిత్ర సమూహ స్వచ్ఛంద పర్యావరణ సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ప్రసాద్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఆరోజు ఉదయం కడప నగరంలో పర్యావరణ హితం కోసం పనిచేస్తున్న వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కడప నగర పాలక సంస్థతో కలిసి తమ సంస్థ 'నా చెట్టు నా బాధ్యత' పేరిట నగరంలోని ముఖ్య కూడళ్లలో నీడనిచ్చే మొక్కలను పెంచే దిశగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఫోన్ కొట్టు-మొక్క పట్టు కార్యక్రమంలో భాగంగా కడప నగర పరిధిలో నగర పాలక సంస్థ, దాతల సహకారంతో 50-50 నిష్పత్తిలో వేప, ఇతర చెట్లను నాటి పరిరక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ఈ అంశంపై ఆసక్తిగల వారు తమ పేరు, ఇంటి చిరునామా, ఆధార్ నెంబరు, ఇంటి లోకేషన్‌లను నమోదు చేస్తూ 62815 60089 ఫోన్ నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. సంస్థ వలంటీర్లు వారం నుంచి రెండు వారాల్లోపుగా కోరిన మొక్కను ఇంటి వద్దకు చేర్చే బాధ్యత తీసుకుంటారన్నారు.

'గడప గడప' కు సంక్షేమ పథకాలు

కమలాపురం : గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని దేవరాజుపల్లె, బాలిరెడ్డిపల్లె, బాలిరెడ్డిపల్లె దళితవాడలో ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వారికి జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్నే మీ ఇంటి ముందుకు పంపించారని, మీకేమైన సమస్యలు ఉంటే తెలపండి అని ఎమ్మెల్యే ప్రజలను అడిగారు. అధిక శాతం మంది ప్రజలు మాకు అన్ని పథకాలు వస్తున్నాయని సంతోషం వెలిబుచ్చారు. కొందరు మాత్రం పింఛన్, మరుగు దొడ్లు, కరెంట్ స్తంభాలు కావాలని అడిగారు. మరి కొందరు సీఎం రిలీఫ్ ఫండ్ రాలేదని, వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు, కుల మతాలకు అతీతతంగా అర్హతే ప్రామాణికంగా జగనన్న గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి సుపరిపాలన అందిస్తున్న సీఎం జగనన్నను మనం తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ చలపతి, ఎంఈఓ జాఫర్ సాదిక్, సీఐ సత్యబాబు, ఎస్ఐ చిన్నపెద్దయ్య, పీఆర్, హౌసింగ్ ఏఈలు సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రజనీకాంత్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, కొండారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మోనార్క్, తదితరులు పాల్గొన్నారు.



దేవరాజుపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

• తాటి.. చలువలో మేటి!

కడప వైఎస్ఆర్ సర్కిల్ : చలువనిచ్చే కాయల్లో తాటి ముంజలది ప్రత్యేక స్థానం. వేసవి కాలంలోనే వచ్చే ఈ పండ్లకు మంచి గిరాకీ ఉంటుంది. మండే వేసవిలో చల్లదనం కోసం ప్రజలు ఎక్కువగా తాటి ముంజలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని పెండ్లిమర్రి, వేంపల్లి ప్రాంతాల్లో తాటి చెట్లు ఎక్కువగా సాగులో ఉన్నాయి. నగరంలోని ఎస్పీ బంగళా, ఆర్టీసీ బస్టాండు, ఐటీఐ సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్‌లోని ప్రాంతాల్లో తాటి ముంజలను ఎక్కువగా అమ్ముతున్నారు. తాటి ముంజలు డజను రూ. 80 నుంచి రూ.100 వరకు పలుకుతుండడం విశేషం.



• దిల్ మ్యాంగో మోర్!

కడప అగ్రికల్చర్ : మార్కెట్‌లోకి మామిడిపండ్లు వచ్చేశాయ్. మామిడి పండ్లు అనగానే ఎవరికైనా నోరూరుతుంది. అందులోను వీరబల్లి బేనీషా, లాల్‌బహార్ మామిడిపండ్లు అంటే చెప్పేదేముంటుంది. కడపలోని జిల్లా పరిషత్ సమీపంలో పలు షాపులను ఏర్పాటు చేసుకుని వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. వీరబల్లి బేనీషా కిలో రూ.100, లాల్‌బార్ కిలో.80 రుపాయలతో జోరుగా అమ్మకాలను చేస్తున్నారు. కొత్తగా మార్కెట్‌లోకి మామిడిపండ్లు రావడంతో ధర కాస్తా ఎక్కువైనా సరే జనాలు తీసుకెళ్తున్నారు. మరో 20 రోజులు గడిస్తే మామిడిపండ్లు అధికంగా మార్కెట్లోకి వస్తాయని.. కిలో బేనీసా రూ. 50కి లాల్ బహార్ రూ. 40 వచ్చే అవకాశం ఉంటుందని వ్యాపారులు తెలిపారు.



'ఆదరణ'లో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరం పాత రిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంతకుముందు ఆమె వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులు, భిక్షాటన చేసే మహిళలు, వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రి నిమిత్తం వైద్యం కోసం వచ్చే నిరుపేదలు, ఒంటరి మహిళల కోసం ప్రభుత్వం ఉచిత నిరాశ్రయుల గృహాలు ఏర్పాటు చేసిందన్నారు. వీటిని ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ సలహా వ్యవస్థను ఆమె వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆమె సూచించారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

బస్టాండ్ వద్ద పోలీసుల తనిఖీలు

కడప అర్బన్ : కడప పాతబస్టాండ్ వద్ద ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలతో పాటు, ఆటోల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాల రికార్డులను తప్పనిరిగా తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత జరిమానాలు ఏవైనా ఉంటే వాటిని వెంటనే చెల్లించాలని సంబంధిత వాహనదారులను సీఐ కోరారు.



కడప పాతబస్టాండ్ వద్ద వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు

నేటి నుంచి శ్రీ లలితా పంచాయతన వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయ పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, చిన్మయ మిషన్ కడపశాఖ అధ్యక్షులు స్వామి తురియానంద తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి విశేష అభిషేకం, ఉత్సవ అంకురార్పణ నిర్వహిస్తామన్నారు. శనివారం ధ్వజారోహణం, ప్రధాన కలశస్థాపన, హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు ఉంటాయన్నారు. ఆదివారం 108 కలశాలతో అభిషేకం, గజవాహనంపై ఊరేగింపు, సోమవారం ఉత్సవ హోమం, సిరి విద్య శ్రీకంఠేశ్వస్వామి కల్యాణం, సింహ వాహనంపై ఊరేగింపు ఉంటాయని వివరించారు. మంగళవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలలో ప్రతిరోజు నిర్వాహకులు స్వామి తురియానంద సరస్వతి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారని వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి

చెన్నూరు : మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ వర్కర్లు సమన్వయంగా పనిచేయాలని ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక సీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళా పోలీసులు, హెల్త్ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, 0 ఉంచి 5 సంవత్సరాల పిల్లలకు సంబంధించిన రికార్డు అందరి వద్ద ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దీనికి సంబంధించి మీకు ఇచ్చిన యాప్‌ల్లో ఒకేలా ఉండేవిధంగా చూడాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఉమాపతి, హెల్త్ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగనపల్లె సురేష్‌బాబు

ప్రజలకు ముందస్తు ఈద్ ముబారక్

కమలాపురం : పవిత్ర రంజాన్ మాసం పూర్తి కానున్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఆర్‌డీఓ ధర్మ చంద్రారెడ్డి ముందస్తు ఈద్ ముబారక్ తెలియజేశారు. గురువారం స్థానిక దర్గా-ఏ-గఫారియాలో పీఠాధిపతి సోదరులు, వైఎస్సార్ సీపీ యువనాయకులు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, ఆయన సోదరులు ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్, ఆర్‌డీఓలను శాలువతో సత్కరించి రంజాన్ ప్రత్యేకతను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజుల పాటు కఠోర ఉపావాసాలు పాటించిన తర్వాత ముస్లిం సోదరులు ఈద్ చేసుకోవడం సంతోష కరమన్నారు. ముస్లిం సోదరులందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. 103 ఏళ్ల పవిత్రత కలిగిన ఈ దర్గాలో ప్రతి ఏటా ఇఫ్తార్ విందుకు తాను హాజరు కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తెల్లవారు జామున సూర్యాస్తమయం వరకు ముస్లిం సోదరులు పాటించే ఉపవాసాలు చాలా పవిత్రం అన్నారు. ముస్లిం సోదరులందరికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌డీఓ ధర్మ చంద్రారెడ్డి ముస్లిం సమాజానికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అఫ్జల్ ఖాన్, పార్టీ నేతలు సుభాన్‌బాషా, నిత్యానందరెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లో వైఎస్ఆర్‌సీపీ నేత అబ్బిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, పెద్దపుత్తలో పార్టీ నేత రాజోలు వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వ పని తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పార్టీ నేతలు లేబాక మునీంద్రారెడ్డి, పుత్తా నారాయణరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల్‌రెడ్డి తల్లి బుధవారం రాత్రి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆమెకు నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మొయిళ్లచెరువు సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ రాఘవయాదవ్ ఉన్నారు.